క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొరిటిపాడు(గుంటూరు): విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా బుధవారం సరఫరా ఉండదని డీ4 సెక్షన్ ఏఈ కె.అంజనీరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు. ఉద్యోగనగర్, ఎస్‌వీఎస్ కాలనీ, నేతాజీనగర్, వైష్ణవీనగర్ ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

తాళాలు పగలగొట్టి చోరీ

లక్ష్మీపురం: ఇంట్లో ఎవరూ లేని సమయాన్ని గమనించి ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలో ఉన్న 6.50 సవర్ల బంగారం, నగదు చోరీ చేసిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాలు.. పి.ఎస్.నగర్ 6వ లైన్‌లో పెద్దపూడి సుబ్బారావు, భార్య సుధారాణి నివాసం ఉంటున్నారు. సుబ్బారావు ఎల్‌వీఆర్ క్లబ్‌లో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం భార్య సుధారాణి పక్క లైన్‌లో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లారు. సుబ్బారావు క్లబ్ నుంచి ఇంటికి వచ్చి భోజనం చేసి ఇంటికి తాళాలు వేసి తిరిగి క్లబ్‌కు వెళ్లారు. సాయంత్రం 7 గంటల సమయంలో భార్య సుధారాణి తిరిగి ఇంటికి వచ్చి చూసే సరికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉన్నాయి. దీన్ని గమనించిన ఆమె భర్త సుబ్బారావుకు ఫోన్ చేసి సమాచారం తెలియజేసింది. గదిలో ఉన్న బీరువాలో ఉన్న బంగారం, నగదు కనిపించకపోవడంతో తక్షణమే అరండల్‌పేట పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ శ్రీనివాసరావు, ఘటనా స్థలానికి చేరుకుని చోరీ తీరును పరిశీలించారు. సమాచారం తెలుసుకున్న క్లూస్ టీమ్ డాగ్ స్క్వాడ్ చేరుకుని పలు కీలకమైన ఆధారాలను సేకరించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు



పొన్నూరు: మండలంలోని భూములకు సంబంధించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని మండల తహసీల్దార్ జియా ఉల్ హక్ తెలిపారు. గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని దండమూడి గ్రామ సచివాలయంలో ఆంధ్రప్రదేశ్ రీసర్వే ప్రాజెక్టుకు సంబంధించి గ్రామ సభ నిర్వహించారు. స్థానికంగా ఉన్న భూ సమస్యలపై ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దార్ రాజా రమేష్ మోహన్, మండల సర్వేయర్ సత్యనారాయణ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.


ఇళ్ల మధ్యలో బ్రాందీషాపు తొలగించాలని వినతి

పెదకాకాని: ఇళ్ల మధ్యలో ఏర్పాటు చేసిన బ్రాందీషాపు తొలగించాలని నంబూరు గ్రామానికి చెందిన ఎస్.సోమగోపాల్‌రెడ్డి ఎక్సైజ్‌శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. పెదకాకాని మండలంలోని నంబూరులోని ప్రధానసెంటర్‌లో సచివాలయం 3,4 నిర్వహిస్తున్నారు. అదే ప్రాతంలో గ్రామ దేవత గంగానమ్మ అమ్మవారి ఆలయం ఉంది. గ్రామంలో సోమవారం నూతనంగా సచివాలయానికి, గుడికి మధ్యలో ఏర్పాటు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

శివాలయంలో కొబ్బరికాయల వ్యాపారికి నోటీసులు

పెదకాకాని: శివాలయంలో కొబ్బరికాయల వ్యాపారికి నోటీసులు ఇచ్చినట్లు ఆలయ డెప్యూటీ కమిషనర్ గోగినేని లీలాకుమార్ తెలిపారు. పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి దేవస్థానంలో స్వామివారి పూజలకు కుళ్లిపోయిన కొబ్బరికాయలు ఇస్తున్నట్లు ఆలయంలో కొబ్బరి చిప్పలు పోగుచేసుకునే వ్యాపారి ఫిర్యాదు చేయడం జరిగింది. అలానే మంగళవారం 'సాక్షి'లో శివా శివా ఇదేమి శంకరా నీ పూజకు కుళ్లిపోయిన కొబ్బరికాయలా అనే పేరుతో కథనం వెలువడింది. దీనిపై స్పందించిన డెప్యూటీ కమిషనర్ మంగళవారం కొబ్బరికాయల వ్యాపారికి నోటీలు జారీ చేశారు. దేవదాయశాఖ నిబంధనల ప్రకారం వివరణ కోరారు. కొబ్బరి చెక్కలు పోగు చేసుకునే హక్కు పొందిన పాటదారుడు బత్తుల భాస్కర్ ఫిర్యాదు మేరకు హరీష్‌కు నోటీసులు ఇవ్వడం జరిగిందని డీసీ తెలిపారు.

టీచ్ టూల్ అబ్జర్వేషన్ త్వరగా పూర్తి చేయండి



తెనాలిఅర్బన్: టీచ్ టూల్ అబ్జర్వేషన్ త్వరగా పూర్తి చేయాలని ఎంఈవోలు మేకల లక్ష్మీనారాయణ, వి.జయంతిబాబు సూచించారు. కొత్తపేటలోని మండల విద్యాధికారి కార్యాలయంలో మంగళవారం టీచ్ టూల్, టీపీడీ మ్యాథ్స్ కోర్స్ కోర్సులపై సమీక్ష జరిపారు. గత నెలలో నిర్వహించిన రివ్యూలో సూచించిన విధంగా పలు ప్రభుత్వ పాఠశాలలో అబ్జర్వేషన్ పూర్తి కాకపోవడంపై కొంత అసహనం వ్యక్తం చేశారు. నవంబర్ నాటికి మొత్తం పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కో–ఆర్డినేటర్ తోట వీరయ్య, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేనూ ఎంహెచ్‌ఓనే...!

- కార్పొరేషన్‌లో ఎక్కడ లేని విధంగా 4 ఎంహెచ్‌ఓలు
- శానిటరీ సూపర్‌వైజర్లుకు ఇన్‌చార్జి ఎంహెచ్‌ఓలుగా పోస్టింగ్
- 23 శానిటరీ డివిజన్లకు 10 మంది మాత్రమే శానిటరీ ఇన్‌స్పెక్టర్లు
- దీంతో పూర్తిగా పారిశుద్ధ్యంపై కొరవడిన పర్యవేక్షణ



గుంటూరు నగరపాలక సంస్థ కార్యాలయం

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ ప్రజారోగ్య విభాగంలో వింత పోకడ నడుస్తోంది. ఏ కార్పొరేషన్‌లో లేని విధంగా గుంటూరులో 4 ఎంహెచ్‌ఓలు(మున్సిపల్ హెల్త్ ఆఫీసర్లు) ఉన్నారంటే అతిశయోక్తి లేదు. గతంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు ఇన్‌చార్జి శానిటరీ సూపర్‌వైజర్లుగా(ఎస్ఎస్) పోస్టింగ్, ఇప్పుడు ప్రస్తుతం ప్రజారోగ్య విభాగంలో శానిటరీ సూపర్‌వైజర్ పోస్టులు లేకపోవడం... ఎవరికి వారు ఎంహెచ్‌ఓ అధికారిగా ఫీలవ్వడంతో శానిటేషన్‌పై పూర్తిగా పర్యవేక్షణ కొరవడిందనే చెప్పుకోవచ్చు.

నగరంలో 23 శానిటరీ డివిజన్లు

గుంటూరు నగరపాలక సంస్థలో 23 శానిటరీ డివిజన్లు ఉన్నాయి. వీటిలో 10 డివిజన్లుకు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు. మిగిలిన 13 డివిజన్లకు మేస్త్రీలు, హెల్త్ అసిస్టెంట్‌లు, సచివాలయ వార్డు ఎన్విరాన్మెంట్ సెక్రటరీలు ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్లుగా పనిచేస్తున్నారు. ప్రజారోగ్యశాఖలోని అధికారులు లంచం తీసుకుని కనీస అవగాహన లేనివారికి ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్లుగా అవకాశం కల్పించారనే ఆరోపణలన్నాయి. అధిక మొత్తంలో చెల్లించిన వారికి పెద్ద వార్డులు, డబ్బులు ఇవ్వనివారికి చిన్న చిన్న వార్డులు కేటాయించారని సమాచారం.

కొరవడిన పర్యవేక్షణ

గతంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లుగా పనిచేసిన ఇద్దరికి ఇన్‌చార్జి శానిటరీ సూపర్‌వైజర్లుగా పోస్టింగ్ ఇచ్చారు. రెగ్యులర్ ఎంహెచ్‌ఓ పోస్టు కొన్ని నెలలుగా ఖాళీగా ఉండటంతో బయాలజీస్ట్ మధుసూదన్‌రావును ఇన్‌చార్జి ఎంహెచ్‌ఓగా నియమించారు. ఈ క్రమంలో చిన్న మున్సిపాలిటీ కమిషనర్‌గా పనిచేసిన గుంటూరు వచ్చిన రామారావుకు తూర్పు ఎంహెచ్‌ఓ పోస్టింగ్ కల్పించారు. ఆ తరువాత బయాలజీస్ట్ మధుసూదన్‌రావుకు ఇన్‌చార్జి ఎంహెచ్‌ఓ పోస్టు నుంచి తప్పించి శానిటరీ సూపర్‌వైజర్లుగా పనిచేస్తున్న ఆనందకుమార్, రాంబాబులకు ఇన్‌చార్జి ఎంహెచ్‌ఓ పోస్టింగ్ ఇచ్చారు. తీరా ఇటీవల జరిగిన బదిలీల్లో రెగ్యులర్ ఎంహెచ్‌ఓగా రవికుమార్ రావడంతో మొత్తం నాలుగురు ఎంహెచ్‌ఓలుగా విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో శానిటరీ సూపర్‌వైజర్‌గా ఉన్న ఆయూబ్‌ఖాన్‌కు అదనంగా ఇంకో వార్డుకి శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. దీంతో ప్రజారోగ్యశాఖలోని సిబ్బంది శానిటరీ సూపర్‌వైజర్లను ఎంహెచ్‌ఓలుగా పిలవాలా? లేక ఎస్ఎస్‌లుగా పిలవాలా అనే డైలామాలో ఉన్నారనే చెప్పుకోవచ్చు.

రేషనలైజేషన్ చేస్తే పారిశుద్ధ్యం మెరుగు... లేకుంటే కష్టమే

గుంటూరు నగర జనాభా పది లక్షల దాకా ఉంది. నగరంలో 2,100 మంది పారిశుద్ధ్య కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. ఒక వార్డులో తక్కువ జనాభాకు ఎక్కువ సిబ్బంది.. మరొక వార్డులో ఎక్కువ జనాభాకు తక్కువ సిబ్బంది ఉన్నారు. వీరందరిని రేషనలైజేషన్ చేసి ఎక్కడ సిబ్బంది తక్కువ ఉన్నారో అక్కడికి సర్దుబాటు చేస్తే పారిశుద్ధ్యం మెరుగుపడే అవకాశం ఉంది. ఇదేమి చేయకుండా శానిటరీ సూపర్‌వైజర్లుకు ఎంహెచ్‌ఓలుగా పోస్టింగ్‌లు, ఇన్‌స్పెక్టర్లుగా శానిటరీ సూపర్‌వైజర్లుగా పోస్టింగ్ ఇస్తే ఏ ప్రయోజనం ఉంటుందో అని శానిటేషన్ సిబ్బంది చెప్పుకుంటున్నారు. ఒక పక్క 90 రోజుల స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ పెట్టినాకి సిబ్బంది కొరతగా ఉంటే ఏ విధంగా పారిశుద్ధ్యం మెరుగుపడుతుందో వేచి చూడాల్సిన పరిస్థితి.

రాష్ట్ర సాఫ్ట్ టెన్నిస్ పోటీలకు కుందన మైత్రి ఎంపిక



గుంటూరు వెస్ట్(క్రీడలు): రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు జిల్లాకు చెందిన బోయినపల్లి కుందన మైత్రి ఎంపికయ్యిందని చాణక్య స్కూల్ ప్రిన్సిపాల్ రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక బీఆర్ స్టేడియంలో నిర్వహించిన అండర–14 సాఫ్ట్ టెన్నిస్ విభాగంలో ప్రతిభకనబరిచి వచ్చే నెల 2వ తేదీ నుంచి కడపలో నిర్వహించనున్న పోటీలకు హాజరు కానుంది. ఈ సందర్భంగా జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు చల్లా వెంకటేశ్వర రెడ్డి అభినందించారు.

ఎస్ఆర్ శంకరన్‌కు ఘన నివాళి

లక్ష్మీపురం: పేదల పక్షపాతి విశ్రాంత ఐఏఎస్ ఎస్ఆర్ శంకరన్ అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ పేర్కొన్నారు. కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జయంతి సభ నిర్వహించారు. సమావేశానికి సంఘం జిల్లా కార్యదర్శి కాబోతు ఈశ్వరరావు అధ్యక్షత వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు కోట మాల్యాద్రి, ఎ.అరుణ్ కుమార్, జి.సత్యానందం, జంగాల చైతన్య, చల్లా మరియ దాసు, ఎస్.వెంకటేశ్వరరావు(చిన్న), ఎస్.చిన్న బాబు పాల్గొన్నారు.

జనవరి 5న హైందవ శంఖారావం



మాట్లాడుతున్న ఫల్గుణరావు

నగరంపాలెం: దేవాలయ వ్యవస్థ సమూల ప్రక్షాళన కోసం వచ్చే ఏడాది జనవరి ఐదో తేదీన విజయవాడలో లక్షలాది మందితో హైందవ శంఖారావం నిర్వహించనున్నట్లు విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీఎస్) ఏపీ(ఉత్తరం) ప్రాంత మందిర– అర్చక పురోహిత ప్రముఖ్ ఎస్.ఫల్గుణరావు తెలిపారు. బ్రాడీపేట విశ్వ హిందూ పరిషత్ కార్యాలయంలో మంగళవారం జిల్లా అర్చక పురోహిత సదస్సు నిర్వహించారు. ఫల్గుణరావు మాట్లాడుతూ మహోన్నతమైన దేవాలయ సంస్కృతి కళ్ల ఎదుట కనుమరుగవడం దేశ గౌరవానికే మాయని మచ్చ అని పేర్కొన్నారు. గత కొంత కాలంగా దేవాలయాలు, దేవాలయ ఆస్తులు, దైవ ప్రతిరూపాలపై జరుగుతున్న దాడులపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. రహదారి విస్తరణ పనుల దృష్ట్యా దేవాలయాలను ఇష్టారాజ్యంగా కూల్చివేయడం ఎక్కువగా జరుగుతుందని అన్నారు. గుంటూరు జిల్లా మందిర–అర్చక పురోహిత ప్రముఖ్ పత్తిపాటి మాధవశర్మ అధ్యక్షత వహించగా, ఉపాధ్యక్షులు మురళీ, ప్రాంత సామాజిక సమరసతా ప్రముఖ్ చిరుమామిళ్ల గోపి, మందిర–అర్చక పురోహిత జిల్లా సహ ప్రముఖ్ తాడికొండ పవన్ శర్మ, కోగంటి రఘుబాబు, జిల్లాలోని ప్రముఖులు పాల్గొన్నారు.



వర్షం వస్తే రోడ్లు మునక

చిన్నపాటి వర్షానికి నగరంలోని ప్రధాన రహదారులు చెరువులా మారుతున్నాయి. వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం సాయంత్రం 20 నిమిషాల పాటు వర్షం కురిసింది. దీంతో సిద్ధార్థ గార్డెన్స్, చంద్రమౌళినగర్, విద్యానగర్‌లో రోడ్లు మునిగాయి. డ్రెయిన్లు అస్తవ్యస్తంగా మారడంతో వర్షం నీటిలో మురుగు కలిసి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోంది. వాహన చోదకులు ముక్కులు మూసుకోవాల్సిన దుస్థితి. ఈ రోడ్డు నుంచి నిత్యం రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రముఖ వ్యాపార వేత్తలు ప్రయాణిస్తుంటారు. అయినప్పటికి నగరపాలక సంస్థ అధికారుల నిర్లక్ష్యం విడడం లేదు. –లక్ష్మీపురం



విద్యానగర్ ప్రధాన రహదారిలో వర్షం నీరు

రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



చేబ్రోలు: రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు మండలంలోని నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం ఏడుకొండలు మంగళవారం తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థులు ఈనెల 26 నుంచి 28వ తేదీ వరకు తెనాలిలో నిర్వహించనున్న అండర్– 14 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ హ్యాండ్ బాల్ టోర్నమెంట్‌లో పాల్గొంటారని చెప్పారు. 8, 9 తరగతి చదువుతున్న వి.హరీష్, వై.అనిల్, ఎస్‌కే బషీరు, ఎస్.చార్లెస్ వెస్లీ, ఎస్.జాన్‌వెస్లీ, పి.క్రాంతి, పి.కార్తీక్ ఎంపికయ్యారు. క్రీడాకారులను ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.ఏడుకొండలు వ్యాయామ ఉపాధ్యాయులు బి.వెంకటేశ్వరరావు, ఎస్.ఉమామహేశ్వరి, శరత్ కుమార్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుంటూరు రూరల్: గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. నల్లపాడు పోలీస్ స్టేషన్ సీఐ వంశీధర్ తెలిపిన వివరాలు.. అమరావతిరోడ్డు నగరాలు వద్ద ఉన్న రిలాక్స్ బార్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడని సమాచారం మేరకు అతడిని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలిచామన్నారు. జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడని తెలిపారు. మృతుని ఆచూకి తెలిసినవారు 8688831376 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగాల పేరుతో మోసం

పోలీసులకు బాధితుల ఫిర్యాదు

లక్ష్మీపురం: సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగాలు కల్పిస్తామంటూ నిరుద్యోగులను మోసగించిన ఘటనపై పోలీసులకు బాధితులు మంగళవారం ఫిర్యాదు చేశారు. బాధితులు తెలిపిన వివరాలు.. ఆంజనేయపేట 2వ లైన్‌లో డెవలప్ ట్రీస్ అనే సాఫ్ట్‌వేర్ కంపెనీని దగ్గుపాటి శ్రావణ్ ప్రారంభించారు. కంపెనీలో ఉద్యోగాల అవకాశాలు ఉన్నాయని చెప్పడంతో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 70 మంది చేరారు. ఉద్యోగాలు చేరేందుకు ఒక్కొక్కరూ రూ.1.50 లక్షలు, కొంత మంది రూ.2 లక్షలు చొప్పున చెల్లించారు. అయితే మూడు నెలలుగా సాఫ్ట్‌వేర్ కంపెనీ యజమాని వారితో పని చేయించుకుంటూ వారికి జీతాలు కూడా చెల్లించడం లేదు. మూడు నెలలు కావడంతో కంపెనీలో ఉద్యోగాలు చేస్తున్న వారందరూ కంపెనీ యజమాని భార్య, నిర్వాహకులను నిలదీయండంతో వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. సమాచారం తెలుసుకున్న అరండల్‌పేట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బాధితుల నుంచి వివరాలు సేకరించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం రాత్రి విచారణ చేపట్టారు.

ప్రజలపై విద్యుత్‌చార్జీల భారం

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్



మాట్లాడుతున్న అజయ్‌కుమార్

లక్ష్మీపురం: కూటమి ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ భారాన్ని మోపుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ ఆరోపించారు. కొత్తపేటలోని పార్టీ జిల్లా కార్యాలయం మల్లయ్య లింగం భవన్‌లో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ట్రూ అప్ చార్జీల పేరుతో పేద ప్రజలపై రూ.814 కోట్ల భారం మోపుతుందని తెలిపారు. గృహ వినియోగదారులు, వ్యాపారులు, వ్యవసాయ రైతులపై ఏడు వేల కోట్ల రూపాయలు అదనంగా వడ్డీంచినట్లు చెప్పారు. చంద్రబాబు నాయుడు అదానీతో లాలూచీపడి స్మార్ట్ మీటర్లు తీసుకొచ్చినట్లు వివరించారు. రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇస్తామని చెప్పి దాని ఊసే ఎత్తడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇళ్ల స్థలాలు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు కావాలన్న అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు ఇప్పుడు ప్లేట్ ఫిరాయిస్తున్నారని చెప్పారు. 32 లక్షల మంది ఇళ్ల లబ్ధిదారులు ఉన్నారని ఈ డిమాండ్ల సాధన కోసం నవంబర్ 18వ తేదీన సచివాలయాల్లో అధికారులకు అర్జీలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. పార్టీ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఆకిటి అరుణ్ కుమార్ మాట్లాడారు.

ముగిసిన రెండు రోజుల వర్క్‌షాపు



అంతర్జాతీయ సదస్సులో పాల్గొన్న నగర కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: అర్బన్ ల్యాండ్ రికార్డ్ కోసం సర్వే– రీ సర్వేలో ఆధునిక సాంకేతిక విధానాల అమలుపై సోమ, మంగళవారాల్లో న్యూ ఢిల్లీలోని అంబేడ్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో నిర్వహించిన అంతర్జాతీయ వర్క్ షాప్ విజయవంతం అయినట్లు గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. కేంద్ర ప్రభుత్వ భూ వనరులు, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ వర్క్ షాప్‌లో నేషనల్ జియో స్పేషియల్ నాలెడ్జ్– పట్టణ నివాసాల ఆధారిత భూమి సర్వేలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో ఎంపికైన కుప్పం, మంగళగిరి– తాడేపల్లి, గుంటూరు, ఒంగోలు, ఏలూరు, కాకినాడ, తిరుపతి, అనంతరపురం మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల కమిషనర్లు, రాష్ట్ర డైరెక్టర్ సర్వే, సెటిల్‌మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీకేష్ బి.లత్కర్ పాల్గొన్నారన్నారు. వర్క్‌షాప్‌లో వివిధ దేశాల, రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొని ఆయా ప్రాంతాల్లో పట్టణాల్లో జరుగుతున్న భూ సర్వే, రీ సర్వే విధానాలను కూలంకషంగా పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారన్నారు. ముఖ్యంగా సర్వే విధానంలో అత్యాధునిక డ్రోన్‌లు, జీఐఎస్‌ల సాంకేతికల వినియోగం ద్వారా, రికార్డ్స్ భద్రపరచడం వంటి అంశాలాను ఉదాహరణలతో చర్చించడం జరిగిందన్నారు.

బాణ సంచా విక్రయ కేంద్రంగా టీజే కాలేజీ మైదానం

వ్యాపారుల సమావేశంలో అధికారుల ప్రకటన



కాలేజీ మైదానాన్ని పరిశీలిస్తున్న అధికారులు

తెనాలి: దీపావళి పర్వదినం సందర్భంగా ఏర్పాటుచేసే బాణాసంచా విక్రయ కేంద్రంగా స్థానిక కొత్తపేటలోని టీజే కాలేజీ మైదానాన్ని ఎంపిక చేశారు. స్థానిక మండల తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం బాణాసంచా హోల్‌సేల్ / రిటైల్ వ్యాపారులతో సమావేశం ఏర్పాటుచేశారు. మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ అధ్యక్షత వహించారు. మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పాల్గొన్నారు. బాణాసంచా స్టాల్స్ ఏర్పాటుకు అనువైన ప్రదేశంపై జరిగిన చర్చల్లో వ్యాపారుల వినతి ప్రకారం టీజే కాలేజీ మైదానంలో నిర్వహించేందుకు అధికారులు అంగీకారం తెలిపారు. అక్కడైతే వినియోగదారులకూ అందుబాటులో ఉంటుందనే భావన వ్యక్తమైంది. బాణాసంచా అమ్మకాల లైసెన్సు కోసం జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం ఈనెల 26వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. తహసీల్దార్ కార్యాలయంలోనే సింగిల్‌విండో విధానంలో అనుమతిని ఇస్తామన్నారు. హోల్‌సేల్ వ్యాపారులు వీధుల్లో విక్రయించే నిమిత్తం తోపుడుబండ్ల వ్యాపారులకు బాణాసంచాను కేటాయించరాదని ఆదేశించారు. బాణాసంచా విక్రయ దుకాణాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ పిల్లలను నియమించరాదని చెప్పారు. బాణాసంచా వ్యాపారులు నిబంధనలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. బాణాసంచా దుకాణాలు ఎల్ ఆకారంలో ఏర్పాటు చేయాలనీ, ఒక్కో దుకాణానికి మధ్య మూడు మీటర్ల దూరం ఉండాలని చెప్పారు. ప్రతి దుకాణంలోనూ ఇసుక బకెట్లు, నీటి వసతిని అందుబాటులో ఉంచుకోవటం తప్పనిసరిగా తెలియజేశారు. దీనికి ముందు ఉదయం పట్టణంలోని టీజే కాలేజీ, వీఎస్సార్ అండ్ ఎన్వీఆర్ కాలేజీ మైదానాలను తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పరిశీలించారు.


ఉద్యోగాలు రెగ్యులర్ చేయాలంటూ వినతి

గుంటూరు మెడికల్: రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థలో పని చేస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేసేలా రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని కోరుతూ మంగళవారం గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్‌ను కలసి పలువురు ఉద్యోగులు వినతి పత్రం అందజేశారు. ఇటీవల కాలంలో మణిపూర్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఉద్యోగులను రెగ్యులర్ చేసిందని, అదే తరహాలో ఏపీలో పనిచేస్తున్న వారిని కూడా రెగ్యులర్ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకునేలా చొరవ చూపించాలని ఎమ్మెల్యేను కోరారు. ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసిన వారిలో ఏపీ రాష్ట్ర హెచ్ఐవీ ల్యాబ్ టెక్నీషియన్స్ అండ్ ఎయిడ్స్ కంట్రోల్ ఎంప్లాయిస్ యూనియన్ మాజీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ షేక్ ముస్తఫా, జిల్లా జనరల్ సెక్రటరీ అహ్మద్ ఆలీ, జిల్లా జాయింట్ సెక్రటరీ పిల్లిమేరీ కుమారి పాల్గొన్నారు.

వైభవంగా శ్రీసాయిక్షేత్రం వార్షికోత్సవం

తెనాలి: రూరల్ మండల గ్రామం నందివెలుగులోని షిర్డీ సాయిబాబా మందిరం 'శ్రీసాయి క్షేత్రం'లో మంగళవారం 12వ వార్షిక మహోత్సవాలు వైభవంగా జరిగాయి. ఉదయం కాకడ హారతితో మొదలై, సాయిబాబా, దత్తాత్రేయ స్వామికి మహన్యాస పూర్వక ఏకాదశ సుగంధ ద్రవ్యాధి సహిత పంచామృత అభిషేకం నిర్వహించారు. తెనాలికి చెందిన శారదా చలపతి బృందంచే శ్రీసాయినామ సంకీర్తన భక్తులకు శ్రవణానందం కలిగించింది. విశిష్ట అతిథులచే శ్రీషిర్డీ సాయినాథుని లీలా ప్రవచనామృతం'తదుపరి మధ్యాహ్న హారతిని వెంపటి చిన సత్యనారాయణ చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం సంధ్య హారతి తదుపరి సాయినాధుని ఊరేగింపు ఉత్సవం నందివెలుగు పురవీధుల్లో సన్నాయి మేళాలు, కీర్తనలు, కోలాటం, నృత్యాలతో కొనసాగింది. గ్రామస్తులు పెద్ద ఎత్తున ఊరేగింపును సందర్శించి, స్వామిని దర్శించుకున్నారు. ఇటీవల దసరా శరన్నవ రాత్రుల్లో భాగంగా బాలబాలికలకు నిర్వహించిన బాబా సచ్చరిత్ర, శ్రీసాయిబాబాపై క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. శ్రీసాయిబాబా పవళింపు సేవ అనంతరం శేజ్ హారతితో కార్యక్రమాలను ముగించారు.

సూరత్‌కు అంబేడ్కర్ కాంస్య విగ్రహాలు



తెనాలి: పట్టణ శిల్పకళకు జాతీయస్థాయి గుర్తింపును తీసుకొచ్చిన స్థానిక సూర్య శిల్పశాల, కాటూరి ఆర్ట్ గ్యాలరీ నిర్వాహకులు కాటూరి వెంకటేశ్వరరావు, ఆయన కుమారుడు రవిచంద్ర తాజాగా డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ ఫైబర్ గ్లాస్, కాంస్య విగ్రహాలను రూపొందించారు. గుజరాత్ రాష్ట్రంలోని సూరత్ పట్టణంలో ప్రతిష్ఠ నిమిత్తం తయారుచేసిన ఈ విగ్రహాలను మంగళవారం ప్రత్యేక వాహనంలో అక్కడకు తరలించారు. గతంలో కుర్చీలో కూర్చున్నట్టు రూపొందించిన అంబేడ్కర్ విగ్రహాన్ని గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు పంపగా, వచ్చిన ఆదరణతో ఇప్పుడు సూరత్ నుంచి ఆర్డరు వచ్చినట్టు కాటూరి తెలియజేశారు. ఏడున్నర అడుగుల ఫైబర్‌గ్లాస్ విగ్రహంతోపాటు నాలుగున్నర అడుగుల ఎత్తులో రెండు కాంస్య విగ్రహాలకు 1300 కిలోల కాంస్యాన్ని వినియోగించి, తయారీకి మూడు నెలల సమయం పట్టినట్టు వివరించారు.